సాక్షి
అనకాపల్లి
గురువారం । 15 । జూన్ । 2023



నారాయణ్ సింగ్‌కు నివాళి
విశాఖ: గ్రేహౌండ్స్ సృష్టికర్త, పద్మశ్రీ నారాయణ్ సింగ్ బాటి మృతికి విశాఖ గ్రేహౌండ్స్ డీఐజీ కె.ప్రవీణ్ నివాళులర్పించారు.



బుల్లెట్ వేగంతో గమ్యం వైపు
తెలుగు రాష్ట్రాల్ని కలుపుతూ అత్యాధునిక సెమీ హై స్పీడ్ రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 4లో



నేటి నుంచి యోగా వారోత్సవాలు
అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం నుంచి వారోత్సవాలు నిర్వహించనున్నారు. 4లో

మట్టిలో మాణిక్యాలు

ఏపీఈఏపీ సెట్‌లో జిల్లా విద్యార్థుల సత్తా

సామాన్య కుటుంబాల నుంచి వచ్చి అసామాన్య ఫలితాలు సాధించారు. మట్టిలో మాణిక్యాలై మెరిశారు. ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. ఒకరు రైతు కుటుంబం నుంచి రాగా.. మరొకరు తాపీ మేస్త్రి బిడ్డ.. ఇంకొకరి తల్లిదండ్రులు మేదరి వృత్తిలో ఉన్నారు. అయితేనేం అద్భుత ఫలితాలు సాధించారు. ఏపీఈఏపీ సెట్‌లో వారి విజయాలకు కుటుంబ సభ్యులే కాక మొత్తం ఊరి ప్రజలు.. జిల్లావాసులు గర్వపడుతున్నారు.

పేదింట విద్యాకుసుమం

రావికమతం: కాయకష్టం చేసుకొని బతికే పేద తల్లిదండ్రులు తమ కుమారుడు ఉన్నత స్థాయికి రావాలని కలలు కన్నారు. వారి ఆశలను నిజం చేస్తూ రావికమతం గ్రామానికి చెందిన దమ్ము వీరవెంకట చైతన్య పవన్‌కుమార్ ఏపీఈఏపీ సెట్ (ఇంజినీరింగ్)లో 411 ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు దమ్ము గోవిందరావు, లక్ష్మి మేదర వృత్తి చేసుకుంటున్నారు. పవన్‌కుమార్ పదో తరగతి వరకూ నర్సీపట్నం చైతన్య స్కూల్‌లో, ఇంటర్ శశి విద్యాసంస్థలో చదువుకున్నాడు. తల్లితండ్రులు ఆనందంతో పవన్‌కుమార్‌కు స్వీట్ తినిపించి సంబరాలు చేసుకున్నారు. కంప్యూటర్ సైన్స్ అంటే తనకు ఇష్టమని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను అవుతానని ఈ సందర్భంగా పవన్‌కుమార్ సాక్షికి తెలిపాడు.



కుమారునికి స్వీట్ తినిపిస్తున్న తండ్రి గోవిందరావు

డాక్టర్ చదువుతా..

నర్సీపట్నం: ఏపీఈఏపీ సెట్ (అగ్రి, ఫార్మశీ)లో 138వ ర్యాంకు సాధించిన మాకిరెడ్డి గంగతల్లి స్వస్థలం నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని బలిఘట్టం గ్రామం. తండ్రి సత్తిబాబు తాపీ మేస్త్రిగా పనిచేస్తూ ఆమెను చదివించారు. వేములపూడి మోడల్ స్కూల్‌లో చదివిన గంగతల్లి ఇంటర్ రాజమండ్రిలోని ప్రైవేట్ కళాశాలలో పూర్తి చేసింది. నీట్ పరీక్షలోనూ మంచి మార్కులు వచ్చినందున డాక్టర్ చదువుతానని తెలిపింది.



మాకిరెడ్డి గంగతల్లి

కేజే పురం కుర్రాడు టాప్ లేపాడు

మాడుగుల రూరల్: ఇంజినీరింగ్, ఫార్మశీ, అగ్రికల్చర్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీఈఏపీ సెట్‌లో పలువురు జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. మంచి మార్కులు, ర్యాంకులు సాధించి టాపర్లుగా నిలిచారు. కె.జె.పురం గ్రామానికి చెందిన కాళ్ల లక్ష్మీసూర్య 33 ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు చిన అప్పలనాయుడు, ఉదయశ్రీ. వారిది వ్యవసాయ కుటుంబం. సామిల్లు నిర్వహిస్తున్నారు. లక్ష్మీసూర్య తెలంగాణ ఎంసెట్‌లో 17వ ర్యాంకు, జేఈఈ మెయిన్స్‌లో 14వ ర్యాంకు సాధించాడు. ఆరో తరగతి వరకు చోడవరం భాష్యం స్కూల్లో చదివిన లక్ష్మీసూర్య ఏడో తరగతి నుంచి ఇంటర్ వరకు గుంటూరు భాష్యంలో విద్యను అభ్యసించాడు. ఇంటర్‌లో 93.8 శాతం మార్కులు సాధించాడు. రోజుకు 13 గంటలు చదివేవాడినని, తన విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే కారణమని చెప్పాడు. ఐఐటీ బొంబాయిలో చదువుకొని సాఫ్ట్‌వేర్ కంపెనీ పెట్టాలన్నది తన లక్ష్యమని చెప్పాడు.



లక్ష్మీసూర్యను అభినందిస్తున్న తల్లిదండ్రులు చిన అప్పలనాయుడు, ఉదయశ్రీ

‘నీట్’గా మెరిశారు

వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించే నీట్‌లో జిల్లా విద్యార్థులు మెరిశారు. అధిక మార్కులతో ఉత్తమ ర్యాంకులు సాధించారు. భవిష్యత్ వైద్యులుగా స్థిరపడేందుకు సిద్ధమయ్యారు.బుధవారం వెల్లడైన ఏపీఈఏపీసెట్‌లో కూడా వీరు మంచి ర్యాంకు సాధించారు. –తుమ్మపాల

కార్డియాలజిస్ట్ నా కల



ఇటీవల విడుదలైన నీట్ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 252, ఓబీసీ కేటగిరీలో 49వ ర్యాంక్ సాధించా. కార్డియాలజిస్టుగా స్థిరపడాలన్నది నా కల. నీట్‌లో ఇంత మంచి ర్యాంకు రావడానికి తల్లిదండ్రుల సహకారమే కారణం. బుధ వారం వచ్చిన ఏపీఈఏపీసెట్ ఫలితాల్లో కూడా 80వ ర్యాంక్ సాధించా.

– శిలపరశెట్టి మోషిత నాగ శశిధర్

వైద్యుడిగా స్థిరపడాలి



మాది అనకాపల్లి టౌన్. నాన్న డీవీఎస్‌కే నాయు డు. తుమ్మపాల జెడ్పీ హైస్కూల్ పీడీ. అమ్మ ఇందిర హౌస్‌వైఫ్. నీట్ ఫలితాల్లో ఆలిండియా ర్యాంక్ 630 వచ్చింది. వైద్యుడిగా స్థిరపడాలన్నది నా కోరిక. తల్లిదండ్రులు, లెక్చరర్ల సహకారం మర్చిపోలేనిది. ఏపీఈఏపీసెట్‌లో కూడా 506వ ర్యాంక్ తెచ్చుకున్నా.

– దొడ్డి ఆర్యన్

డాక్టర్‌గా సేవలందిస్తా..



మళ్ల అమృత

నర్సీపట్నం: ఏపీఈఏపీ సెట్ లో 36వ ర్యాంకు సాధించిన నర్సీపట్నం శారదనగర్‌కు చెందిన విద్యార్థిని మళ్ల అమృత డాక్టర్‌గా సేవలందించడమే తన లక్ష్యమని పేర్కొంది. ఆమెకు నీట్‌లో కూడా మంచి మార్కులు వచ్చాయి. తల్లిదండ్రులు శ్యామ్ సుందరరావు, రూప ప్రభుత్వ ఉపాధ్యాయులు. అమృత 7వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు రాజమండ్రిలోని ప్రైవేట్ కళాశాలలో చదువుకుంది. డాక్టర్‌గా రాణించి పేద ప్రజలకు సేవలు అందిస్తానని చెప్పింది.

సత్తా చాటిన గౌరీపట్నం విద్యార్థి

చోడవరం రూరల్: ఏపీఈఏపీ సెట్‌లో గౌరీపట్నం గ్రామానికి చెందిన మంగా చంద్రవర్ధన్ 835వ ర్యాంకు సాధించాడు. తనకు ఐఐటీలో సీటు సాధించాలన్నది లక్ష్యమని, ఎంట్రన్స్ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నానని తెలిపాడు. చంద్రవర్ధన్ తండ్రి శ్రీనివాసరావు అంకుపాలెం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తల్లి భవాని గృహిణి. కుమారుడికి ర్యాంకు రావడంతో బంధుమిత్రులు అభినందనల్లో ముంచెత్తారు.



చంద్రవర్ధన్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

పేట విద్యార్థికి 771వ ర్యాంకు

పాయకరావుపేట: పాయకరావుపేట బృందావనానికి చెందిన విద్యార్థి దరిసి సూర్యతేజ ఏపీఈఏపీ సెట్‌లో 771వ ర్యాంకు సాధించాడు. అతని తల్లిదండ్రులు రమేష్ కుమార్, కల్యాణి. సూర్యతేజ కాకినాడలోని ఆదిత్య జూనియర్ కాలేజ్‌లో ఇంటర్‌మీడియట్ చదివాడు. సూర్యతేజకు 771వ ర్యాంకు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. కంప్యూటర్ ఇంజినీర్ కావాలన్నది తన ఆశయమని సూర్యతేజ తెలిపాడు.



సూర్యతేజకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

న్యూస్‌రీల్

రేపు డయల్ యువర్ డీపీటీవో

అనకాపల్లి టౌన్: జిల్లా ప్రజారవాణాశాఖ(ఆర్టీసీ) కార్యాలయంలో ఈనెల 16న ప్రయాణికుల సమస్యలపై డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి కె.పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రయాణికులు 7382913677 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను తెలపాలని ఆమె కోరారు.

రూ.50లకే స్టూడెంట్ బస్ పాస్

- ఆర్టీసీ డీఎం ధీరజ్

నర్సీపట్నం : విద్యార్థులకు ఆర్టీసీ సంస్థ కేవలం రూ.50 రూపాయలకే ఏడాది పాటు ప్రయాణించేందుకు వీలుగా బస్ పాస్ సౌకర్యం కల్పించిందని సంస్థ డిపో మేనేజర్ ధీరజ్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ పథకంపై అవగాహన ఉండాలన్నారు. పదో తరగతి వరకు చదివే విద్యార్థినులు, 7వ తరగతి వరకు విద్యార్థులకు ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందన్నారు. స్టూడెంట్ పాస్‌లు ఆర్టీసీ డిపోలో మాత్రమే ఇవ్వనున్నట్టు తెలిపారు. విద్యార్థుల కోసం ఆరు బడి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. నర్సీపట్నం డిపోకు ఆరు బస్సులు ప్రతిపాదనలు చేయగా మూడు కొత్త బస్సులు వచ్చాయన్నారు. మే నెలలో డిపో ఆదాయం బాగుందని, రోజుకు రూ.15 లక్షలకు పైగా వచ్చినట్టు వెల్లడించారు.

తూర్పు నౌకాదళాధిపతితో పోర్టు చైర్మన్ భేటీ



పోర్టు చైర్మన్ డా.అంగముత్తుకు జ్ఞాపిక అందిస్తున్న ఈఎన్‌సీ చీఫ్ వైస్‌అడ్మిరల్ గుప్తా

సాక్షి, విశాఖపట్నం : తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్‌దాస్ గుప్తాతో విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) చైర్మన్ డా.మద్యయన్ అంగముత్తు బుధవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈఎన్‌సీ ప్రధాన కార్యాలయంలో ఇరువురూ సమావేశమై.. భవిష్యత్తులో తూర్పు నౌకాదళం, వీపీఏ సంయుక్తంగా నిర్వహించనున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఇటీవల పోర్టులో నిర్వహిస్తున్న పలు ప్రాజెక్టులు, నేవల్ అవుటర్ హార్బర్ ప్రాజెక్టు, ఐఎన్‌ఎస్ విక్రాంత్‌కు బెర్తింగ్ తదితర అంశాల గురించి వివరించారు.

ఐటీఐ కౌన్సెలింగ్ ప్రారంభం



అర్హత పత్రాన్ని అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్ రాణి సుష్మిత, కన్వీనర్ శ్రీకాంత్, సిబ్బంది

కంచరపాలెం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి బుధవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌ను డిప్యూటీ కలెక్టర్ రాణి సుష్మిత, ఉపాధి, శిక్షణ శాఖ ప్రిన్సిపాల్, కన్వీనర్ జె.శ్రీకాంత్ ప్రారంభించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్‌లో 1 నుంచి 515 ర్యాంక్ అభ్యర్థులకు పాల్గొంటే 290 మంది అభ్యర్థులు ప్రభుత్వ ఐటీఐల్లో అర్హత సాధించారు. రెండో ర్యాంక్ సాధించిన వి.దినేష్‌కుమార్‌కి ఎలక్ట్రిషన్ ట్రేడ్‌లో అర్హత పత్రాన్ని అధికారులు అందజేశారు. గురువారం జరిగే కౌన్సెలింగ్‌కు 516 నుంచి 1,206 ర్యాంక్ అభ్యర్థులు కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

ఆర్ఐవోగా సత్యనారాయణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యనారాయణ

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి(ఆర్ఐవో)గా రాయల సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. జిల్లా వృత్తి విద్యాధికారిగా పని చేస్తున్న సత్యనారాయణకు ఆర్ఐవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఎం.వి.శేషగిరి బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం భీమునిపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న పి.ఉమారాణి ఆర్ఐవోగా వ్యవహరిస్తున్నారు. సత్యనారాయణ నియామకంతో ఆమె తిరిగి తన మాతృస్థానానికి వెళ్లారు. ఉన్నతాధికారుల సహకారం, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున జిల్లా అధికారుల సూచనలతో ఇంటర్మీడియట్ విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సత్యనారాయణ తెలిపారు.

నో ప్లాస్టిక్ జోన్‌గా విశాఖ

- ప్రణాళికాబద్ధంగా అమలు
- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ



అల్లిపురం (విశాఖ దక్షిణం): నో ప్లాస్టిక్ జోన్‌గా విశాఖ నగరాన్ని తీర్చిదిద్దుతామని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకో వైజాగ్ క్యాంపెయిన్ జరుగుతున్న విధానాన్ని వివరించారు. ఎకో క్లీన్, ఎకో గ్రీన్, ఎకో బ్లూ, ఎకో జీరో ప్లాస్టిక్, ఎకో జీరో పొల్యూషన్ అంశాలతో ఎకో వైజాగ్ ప్రచారం ప్రారంభమై తొమ్మిది రోజులు గడిచిందన్నారు. అందులో భాగంగా విశాఖ నగర పరిధిలో ప్రత్యేక బృందాల ద్వారా ఇప్పటి వరకు 623 కిలోల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను సీజ్ చేసి రూ.5,50,200 జరిమానా విధించామన్నారు. ఎకో జీరో పొల్యూషన్‌లో భాగంగా డోర్ టు డోర్ చెత్త సేకరణకు 10 ఎలక్ట్రిక్ ఆటోలను బీచ్ రోడ్‌లో ఏర్పాటు చేశామన్నారు. జూలై 1 నుంచి మరో 65 ఆటోలను అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు వెల్లడించారు. పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటే కార్యక్రమం మరోసారి ప్రారంభిస్తున్నామని కమిషనర్ తెలిపారు. మంగళవారం అన్ని హోటళ్ల యజమానులతో సింగిల్ ప్లాస్టిక్ వాడకాన్ని ఆపాలని మీటింగ్ పెట్టామని, మంచి స్పందన వచ్చిందన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో ప్లాస్టిక్ సంచులు, పేపర్లు కాకుండా గిరిజన మహిళలు ఆకులతో తయారు చేసే వాటిని యుసీడీపీడీ ద్వారా సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్లాంటేషన్‌పై డ్రైవ్ నిర్వహిస్తామని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి నీడ వచ్చేలా ప్రణాళికలు చేపడుతున్నామన్నారు. శానిటేషన్ విభాగంలో 119 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగుల పిల్లలకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. 60 ఏళ్లు దాటిన ఉద్యోగుల పిల్లలకు కూడా ఉపాధి కల్పించడానికి కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

నిబంధనల ప్రకారమే దుకాణాల తొలగింపు..

జగదాంబ జంక్షన్ నుంచి వన్‌టౌన్ విక్టోరియా ఆస్పత్రి వరకు 60 అడుగుల రోడ్డు నిర్మించడానికి నిబంధనల ప్రకారమే పనులు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సాయికాంత్‌వర్మ తెలిపారు.

ఆ మూడు రంగాలకు పెద్దపీట

- ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్
- జగనన్న గృహ నిర్మాణాలపై సంతృప్తి



నాడు–నేడు పనులపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ నివాస్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి

సబ్బవరం : ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేసిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆరోగ్య శాఖ కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి జె.నివాస్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి ఆయన బుధవారం విస్తృతంగా పర్యటించారు. అమృతపురం గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మమేకమయ్యారు. ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న విత్తనాలు, ఎరువులతో పాటు పలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాగులో ఉన్న పంటల వివరాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సచివాయాలన్ని సందర్శించి సిబ్బంది పనితీరు, అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారుల హాజరు, టీఎంఆర్, బాలామృతం పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మండల పరిషత్ పాఠశాలలో సుమారు రూ.12 లక్షలతో చేపడుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. పనులకు సంబంధించి నిధులు వెచ్చించిన వివరాల రికార్డులను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, వంటశాల పరిసర ప్రాంతాల్లో తీసుకుంటున్న జాగ్రత్తలను కమిషనర్ నివాస్ పరిశీలించారు. ఫిర్యాదుల పెట్టె, హెల్త్ అంబాసిడర్స్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమృతపురంలో జగనన్న లే అవుట్‌ను పరిశీలించారు. లే అవుట్‌లో అధిక శాతం గృహ నిర్మాణాలు పూర్తికావడంతో పాటు నాణ్యతా ప్రమాణాలతో ఇళ్లు నిర్మించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతూ బిల్లుల చెల్లింపు, మౌలిక వసతుల కల్పన వంటి వివరాలను తెలుసుకున్నారు. బిల్లుల చెల్లింపు, విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు, పట్టాల పంపిణీ వంటి వాటిపై అధికారులు, స్థానిక నాయకుల నుంచి ఏవైనా సమస్యలు తలెత్తాయా? అని కలెక్టర్ ప్రశ్నించడంతో అలాంటి సమస్యలేమీ లేవని లబ్ధిదారులు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

అంతకు ముందు ఆయన మండలంలోని గొల్లలపాలెం శివారు విప్పాక అగ్రహారంలో చేపట్టిన రీ సర్వేను పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడి సమగ్ర రీ సర్వే వివరాలు, సమస్యలను తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, పీడీ అనంతలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.మోహన్‌రావు, ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పూడిమడక.. పర్యాటక నడక

పర్యాటకం.. అదృశ్య వాణిజ్యం. దేశ జీడీపీలో 6.8 శాతం పర్యాటక రంగానిదే. కోవిడ్ తర్వాత పర్యాటక రంగం మళ్లీ పుంజుకుంటోంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీరప్రాంత పర్యాటకంపై దృష్టి సారించింది. అందులో భాగంగానే పూడిమడక తీరాన్ని పర్యాటక పరంగా అభివృద్ధి చేసేందుకు సంకల్పించింది.

- జిల్లాలో తొలి తీరప్రాంత టూరిజం స్పాట్‌గా ప్రతిపాదనలు
- 2.58 ఎకరాల్లో టూరిజం ప్రాజెక్టు
- లాండ్ ఎలివేషన్ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభం



పూడిమడక తీరం

అచ్యుతాపురం(అనకాపల్లి) : ప్రజలు ఒత్తిడితో కూడుకున్న తమ జీవితాల నుంచి కాస్త ఉపశమనం పొందేందుకు పర్యాటక ప్రాంతాలను ఆశ్రయిస్తున్నారు. పర్యాటక శాఖ కూడా ఆయా ప్రాంతాలపై దృష్టి సారిస్తోంది. సహజసిద్ధంగా పర్యాటకుల్ని రప్పించుకునే ప్రాంతాల్లో మండంలోని పూడిమడక తీర ప్రాంతమొకటి. ఇక్కడ వసతులు మెరుగు పరిచేందుకు ఆ శాఖ అధికారులు ముందుకొచ్చారు. సర్వే నెం.85లో 2.58 ఎకరాల్లో టూరిస్టు స్పాట్‌ను నిర్మించనున్నారు. దీనిలో రిసార్టులు, కాటేజీ, ఫుడ్ కోర్టు ఇతర వసతులు కల్పించనున్నారు. ల్యాండ్ ఎలివేషన్ పూర్తయిన వెంటనే వసతుల ఏర్పాటు పనులు ప్రారంభించేందుకు సంబంధింత శాఖ సిద్ధంగా ఉంది.

రక్షణ గల తీరం

పూడిమడక తీర ప్రాంతానికి విశిష్టత ఉంది. సముద్రంలో స్నానం చేసే వారిపై ఇక్కడ అలల పోటు ఉండదు. అంతే కాకుండా సముద్ర తీరం సమతలంగా ఉంటుంది. దీంతో పూడిమడకలో స్నానం చేస్తూ కొట్టుకుపోయిన ఘటనలు దాదాపు కనిపించవు. అంతే కాకుండా పూడిమడక తీరానికి కూత వేటు దూరంలో రెండు సహజసిద్ధ కొండలు సముద్ర గర్భంలోంచి పొడుచుకొచ్చాయా? అన్నట్టు ఆకట్టుకుంటాయి. ఇవి రాకాసి అలల్ని ఒడ్డుకు రాకుండా అడ్డుకుంటాయి. కొండకు ఒకవైపున్న పూడిమడక నుంచి కనుచూపు మేరలో విశాలమైన తీరం కనిపిస్తుంది. ఏపీ తీర ప్రాంతంలో అతి పెద్ద మత్స్యకార గ్రామంగా దీనికి గుర్తింపు.

అపరిశుభ్రతే అడ్డంకి

పూడిమడక వాసులు ఆర్థికంగా వెనుకబడిన వారైనందున తీర ప్రాంతంలో వారి కదలికలు ఎక్కువగా ఉంటాయి. ఈ కారణంగా అక్కడి అపరిశుభ్ర వాతావరణం పర్యాటకులకు కాస్త ఇబ్బందిని కలిగిస్తుంది. దీంతో పూడిమడక వచ్చే పర్యాటకులు పక్కనున్న సీతపాలెం, తంతడి బీచ్‌లకు వెళ్లిపోతున్నారు. దీన్ని నియంత్రించి, పర్యాటకులకు అనువైన వసతుల్ని ఏర్పాటు చేస్తే, పూడిమడక తీరం అందాలను తనివితీరా ఆస్వాదించొచ్చు.

పూడిమడక ప్రత్యేకతలు...

అనకాపల్లి జిల్లాలో చక్కని రహదారి సౌకర్యం ఉన్న తీర ప్రాంత గ్రామం. మొగ నుంచి సహజ సిద్ధంగా ఏర్పడిన ఉప్పుటేరు అందాలు ఇక్కడి అద్భుతాల్లో ఒకటి. ఉప్పు గల్లీల సొగసు చూపరులను కట్టిపడేస్తుంది. ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన లైట్ హౌస్, సువిశాల తీరం, కనుచూపు మేరకు లో కనిపించే సహజసిద్ధ కొండలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటాయి. కొత్తేరు ప్రాంతం మరింత ఆహ్లాదకరం.



సర్వే నంబర్ 85లోని స్థలంపై మ్యాప్ ఆధారంగా అధికారులతో చర్చిస్తున్న జేసీ జాహ్నవి (ఫైల్)

లైట్‌హౌస్ పక్కన టూరిస్ట్ స్పాట్

పూడిమడకలో టూరిస్టు స్పాట్ ఏర్పాటుకు అభ్యంతరం లేదు. అయితే స్థలాన్ని మార్చాలి. ఉప్పుటేరు నుంచి నీరు ఎక్కువగా వచ్చినప్పుడు కొత్తేరు ద్వారా సముద్రంలోకి మళ్లిస్తాం. ఇప్పుడు అక్కడ టూరిస్టులకు వసతులు కలిస్తే నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. సమీపంలోని శ్మశానం కూడా టూరిస్టులకు ఇబ్బందికరంగా ఉంటుంది. లైట్ హౌస్ పక్కన టూరిస్ట్ స్పాట్ ఏర్పాటు చేస్తే, అందరికీ ఆమోదంగా ఉంటుంది.

– చేపల సుహాసిని, సర్పంచ్

ల్యాండ్ ఎలివేషన్ పూర్తయిన వెంటనే పనులు



పూడిమడకలో పర్యాటకులకు వసతులు కల్పిస్తాం. 2.58 ఎకరాల స్థలంలో రిసార్టులు, కాటేజీలు, ఫుడ్ కోర్టు తదితర సదుపాయాలు కల్పిస్తాం. పూడిమడక అందాలు వీక్షించాలని వచ్చే సుదూర ప్రాంత పర్యాటకులు ఇక్కడే బస చేసేలా ఏర్పాట్లు చేస్తాం. స్థలం మార్పుపై జేసీ, రెవెన్యూ అధికారులు చర్చించారు. స్థలం ఎక్కడైనా టూరిస్ట్ స్పాట్ అభివృద్ధికి పర్యాటక శాఖ సన్నద్ధంగా ఉంది.

– అశోక్, జిల్లా పర్యాటక శాఖ అధికారి, అనకాపల్లి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

యలమంచిలి : మండలంలో రేగుపాలెం హైవే జంక్షన్ వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బుధవారం మృతి చెందినట్టు ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నక్కపల్లి మండలం మామిడి పాలెం గ్రామానికి చెందిన మొల్లి నాగేష్ (16) మూడు రోజుల క్రితం యలమంచిలి మండలం రేగుపాలెం హైవే జంక్షన్ వద్ద తను ప్రయణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి ప్రైవేట్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయాలతో విశాఖపట్నంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని, కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

నిండు గర్భిణి ఆత్మహత్య

-కడుపు నొప్పి తాళలేక అఘాయిత్యం


శ్రావణి (ఫైల్)

నక్కపల్లి : మండలంలో వెదుళ్ల పాలెం గ్రామానికి చెందిన గర్భిణి కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన ఓరుగంటి శ్రావణి (21)కి పెనుగొల్లుకు చెందిన శివతో మూడు మాసాల క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం ఈమె రెండు నెలల గర్భిణి. ఈమె తరచూ కడుపు నొప్పితో బాధపడుతోందని, కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం రాత్రి కడుపునొప్పి తీవ్రంగా రావడంతో తన గదిలోకి వెళ్లి చీరతో ఉరేసుకుందన్నారు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆమెను కిందికి దించి ఆస్పత్రికి తరలించేలోపే మరణించిందని కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుమార్తె కడుపునొప్పి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిందని, ఆమె తల్లి పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శిరీష తెలిపారు.

బుల్లెట్ వేగంతో గమ్యం వైపు

- గంటకు 220 కి.మీ వేగంతో రాకపోకలు సాగించేలా రైల్వే లైన్లు
- విశాఖపట్నం–విజయవాడ–శంషాబాద్‌కు సెమీ హైస్పీడ్ లైన్
- విశాఖపట్నం–విజయవాడ– కర్నూలు టౌన్ వరకూ మరో మార్గం
- రెండూ కలిపి కంబైన్డ్‌గా 942 కి.మీ స్పీడ్ ట్రాక్ ఏర్పాటు
- ప్రిలిమినరీ ఇంజినీరింగ్ కమ్ ట్రాఫిక్ సర్వే (పీఈటీఎస్)కు అడుగులు


విశాఖపట్నం రైల్వే స్టేషన్

'ఎప్పుడెక్కామన్నది కాదన్నయ్యా.. బుల్లెట్ వేగంతో చేరుకున్నామా లేదా..' అనే డైలాగ్ ప్రయాణికులు చెప్పుకునేలా.. సరికొత్త ఆధునిక రైల్వే లైన్ల నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. విశాఖ నుంచి విజయవాడ మీదుగా శంషాబాద్, విశాఖ నుంచి విజయవాడ మీదుగా కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్ రైలు మార్గాలు రానున్నాయి. ఈ రెండు మార్గాలకు సంబంధించిన పీఈటీఎస్ సర్వే నిర్వహించేందుకు రైల్వే శాఖ సమాయత్తమైంది.

సాక్షి, విశాఖపట్నం : రైళ్ల వేగంలో మార్పులు మొదలయ్యాయి. ఇప్పటికే వందేభారత్ రైళ్లతో కొత్త శకానికి నాంది పలికిన భారతీయ రైల్వే శాఖ.. ఇప్పుడు అంతకు మించి అన్నట్లుగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాల్ని కలుపుతూ అత్యాధునిక సెమీ హై స్పీడ్ రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న రైల్వే ట్రాక్‌ల సామర్థ్యం 110 నుంచి గరిష్టంగా 150 కిలోమీటర్లు. ముఖ్య నగరాల్ని కలుపుతూ గంటకు 220 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే విధంగా సెమీ హైస్పీడ్ రైల్వే లైన్‌లను ఏర్పాటు చేయనున్నారు.

మూడు రాజధానుల్ని అనుసంధానం చేస్తూ..

ఏపీ ప్రభుత్వం మూడు రాజధానుల్ని అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా.. అమరావతి శాసన రాజధానిగా, కర్నూలు న్యాయ రాజధానిగా అభివృద్ధి కానున్నాయి. తాజాగా వస్తున్న రైల్వే లైన్లు కూడా ఈ మూడు రాజధానుల్ని అనుసంధానిస్తున్నట్లుగానే డిజైన్ చేశారు. అదేవిధంగా.. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో కీలకంగా ఉన్న శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుతో ఈ లైన్లు అనుసంధానం కానున్నాయి. అంటే.. శంషాబాద్ నుంచి విజయవాడ మీదుగా విశాఖపట్నం, విశాఖపట్నం నుంచి విజయవాడ మీదుగా కర్నూలు టౌన్ రైల్వే స్టేషన్ వరకూ ఈ సెమీ హైస్పీడ్ రైలు మార్గాలు రానున్నాయి. మొత్తం 942 కిలోమీటర్ల మేర.. గంటకు 220 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయేలా ట్రాక్‌లు నిర్మించనున్నారు.

5 గంటల్లో విశాఖ టూ హైదరాబాద్

ప్రస్తుతం హైదరాబాద్ నుంచి విశాఖపట్నం చేరుకోవాలంటే 11 నుంచి 12 గంటల సమయం పడుతుంది. కానీ.. ఈ సెమీ హైస్పీడ్ ట్రాక్ నిర్మాణం పూర్తయితే.. 4 నుంచి 5 గంటల్లో విశాఖ నుంచి హైదరాబాద్ చేరుకోవచ్చు. ప్రస్తుతం నడుస్తున్న వందేభారత్ రైళ్ల గరిష్ట వేగం 160 కిలోమీటర్లు అయినా.. ప్రస్తుతం 80 నుంచి 120 కి.మీ వేగంతో నడుస్తున్నాయి. భవిష్యత్తులో వందేభారత్ రైళ్లను అప్‌గ్రేడ్ చేస్తున్నారు. వందేభారత్‌లోనూ స్లీపర్ కోచ్‌లు రాబోతున్నాయి. కొత్తగా రాబోతున్న ఈ ట్రైన్లు గంటకు 200 కి.మీ వేగంతో దూసుకెళ్లేలా తయారు కాబోతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన మార్గాల్లో ఎక్కువ శాతం ఈ ట్రైన్‌లు నడపాలని రైల్వే శాఖ భావిస్తోంది. అందుకే.. ఈ సెమీ హైస్పీడ్ కారిడార్స్ ప్రాజెక్టుపై దృష్టి సారించింది.

పీఈటీఎస్‌కు టెండర్లు

ఈ రెండు కారిడార్లకు సంబంధించి ప్రిలిమినరీ ఇంజినీరింగ్ కమ్ ట్రాఫిక్ సర్వే(పీఈటీఎస్)కు రైల్వే బోర్డు టెండర్లు ఖరారు చేసింది. సింగిల్ పాకెట్‌లో ఈ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. రూ.2.70 కోట్లతో నిర్వహించనున్న ఈ సర్వేను ఆరు నెలల్లో పూర్తి చేయాలని సదరు సర్వే సంస్థకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది చివరి నాటికి సర్వే పూర్తయిన వెంటనే.. ఈ సెమీ హై స్పీడ్ కారిడార్ పనులకు సంబంధించిన ప్రాథమిక అంచనా వ్యయాన్ని నిర్ధారిస్తూ.. డీపీఆర్ సిద్ధం చేయనున్నారు. డీపీఆర్ పూర్తయిన వెంటనే పనులకు టెండర్లు పిలవాలని రైల్వే శాఖ అధికారులు నిర్ణయించారు. ఈ కారిడార్ పనులు పూర్తయితే.. ఏపీ తెలంగాణ మధ్య రవాణా మరింత సులభతరం, వేగవంతం కానుందని వాల్తేరు డివిజన్ అధికారులు భావిస్తున్నారు. విశాఖను అనుసంధానం చేస్తూ జరుగుతున్న ఈ కారిడార్‌కు రైల్వే శాఖ ప్రాధాన్యమివ్వడం శుభపరిణామంగా చెబుతున్నారు.

ఏపీ ఈఏపీ సెట్‌లో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ


యు.వెంకటేష్


ఎన్.సూర్యచరణ్


ఎస్.అశోక్

పాయకరావుపేట: ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి మంచి ర్యాంక్‌లు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.ఎస్.ఎస్. భానుమూర్తి బుధవారం తెలిపారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో యు.వెంకటేష్ 497 ర్యాంకు, ఇంజినీరింగ్ విభాగంలో ఎన్.సూర్యచరణ్ 767 ర్యాంక్, ఎస్.అశోక్ 1258 ర్యాంక్ సాధించారని ఆయన తెలిపారు. 10,000 లోపు ర్యాంక్‌లు 23 మంది విద్యార్థులు సాధించినట్టు చెప్పారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ తదితరులు అభినందించారు.

ఆర్అండ్‌బీ ఎస్ఈగా కాంతిమతి

సాక్షి, విశాఖపట్నం: రోడ్లు భవనాల శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్(ఎస్ఈ)గా కె.కాంతిమతి నియమితులయ్యారు. ఆమె శ్రీకాకుళం ఎస్ఈగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఉమ్మడి విశాఖ జిల్లాకు ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న జాన్ సుధాకర్ శ్రీకాకుళం బదిలీ అయ్యారు. జాన్ సుధాకర్ విధుల నుంచి రిలీవ్ అవ్వడంతో ఆ స్థానంలో కాంతిమతి తాజాగా బాధ్యతలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


మృతి చెందిన తణకాల నాయుడు

చోడవరం రూరల్: మండలంలోని గజపతినగరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి మృతి చెందినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. సీఐ కథనం ప్రకారం గజపతి నగరానికి చెందిన తణకల నాయుడు(37) లారస్ కంపెనీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత నెల 30 తేదీ రాత్రి డ్యూటీ దిగిన నాయుడు గోవాడ నుంచి సమీపంలోని గజపతినగరం గ్రామానికి నడుచుకుని బయలుదేరాడు. శారదా నది వంతెన దిగువన వెనుక నుంచి వచ్చిన బైకు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనకు విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందజేశారు. ఈనెల 12న ఆస్పత్రినుంచి డిశ్చార్జ్ అయిన నాయుడు తిరిగి అస్వస్థతకు గురి కావడంతో మంగళవారం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకొచ్చేందుకు అంబులెన్స్ ఎక్కిస్తుండగా నాయుడు మృతి చెందాడని సీఐ చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

రేపే మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 16వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) ఒక ప్రకటనలో తెలిపారు. రిలయన్స్ నిప్పన్, జయభేరి, సుస్వాదీప్ అగ్రో, టీజయ్ ఇండియా, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 380 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజనీర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజినీర్ కేడ్, టెలి కాలింగ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్యాడ్యుయేట్, ఐటీఐ, డిప్లమా, ఎంబీఏల్లో ఉత్తీర్ణత సాధించి 18–35 సంవత్సరాల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాల బట్టి జీతం నెలకు రూ.12,000 నుంచి రూ.20,000ల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు nc-r.-go-v.i n వెబ్‌సైట్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ప్రాణం తీసిన ఈత సరదా


ఘటనా స్థలంలో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

- శారద నదిలో ఈతకు దిగిన ఏడుగురు స్నేహితులు
- నీట మునిగి ఐటీఐ విద్యార్థి మృతి
- సోమలింగపాలెం వద్ద ఘటన


మృతి చెందిన గొండి నాగేష్


గొండి నాగేష్ (ఫైల్‌ఫోటో)

యలమంచిలి : ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణాలు తీసింది. సరదాగా ఈతకు వెళ్లి ఆనందంగా గడుపుదామని వెళ్లిన స్నేహితుల్లో ఒకరు నీట మునిగి మృతి చెందడంతో ఆ విద్యార్థి కుటుంబం కన్నీరు మున్నీరైంది. ఈ ఘటనపై యలమంచిలి రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపిన వివరాలివి. యలమంచిలి పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన గొండి నాగేష్ (16) తన స్నేహితులతో కలసి బుధవారం మధ్యాహ్నం 2గంటలు సమయంలో యలమంచిలి మండలం సోమలింగపాలెం, గోకివాడ శారదనది ఆనకట్ట వద్ద స్నానానికి దిగారు. ఇంతలో ప్రమాదవశాత్తూ గొండి నాగేష్ నీట మునిగి మరణించాడు. నాగేష్ అచ్యుతాపురం మండలంలో ప్రైవేట్ కళాశాలలో ఐటీఐ చదువుతున్నాడు. నాగేష్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా ఘటనా స్థలంలో విలపించారు. నాగేష్ తండ్రి అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

స్పందనస్ఫూర్తి ఫైనాన్షియల్ నగదు స్వాహా !

- సంస్థ సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు

చోడవరం రూరల్: స్థానిక స్పందన స్ఫూర్తి ఫైనాన్సియల్ లిమిటెడ్ సంస్థలో నిధులు పక్కదారి పట్టినట్టు ఆ కంపెనీ క్లస్టర్ మేనేజర్ సూర్యప్రకాష్ చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకులో పనిచేస్తున్న మేనేజర్, క్యాషియర్‌లు సంస్థ నగదు సుమారు రూ.6,57,270 కాజేసినట్టు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్న చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యప్రకాష్ స్పందనస్ఫూర్తి ఫైనాన్షియల్ చోడవరం బ్రాంచిలో క్లస్టర్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. బ్యాంకు క్యాషియర్, మేనేజర్‌లు బ్యాంకు రుణ ఖాతాదారుల నుంచి వసూలు చేసిన మొత్తాలను ఏరోజుకారోజు డిపాజిట్ చేయాల్సి ఉండగా ఈనెల 8వ తేదీ మధ్యాహ్నం కొంత మొత్తాన్ని డిపాజిట్ చేసి, మిగిలిన మొత్తం రూ.6,57,270 డిపాజిట్ చేయలేదు. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ సంతోష్, క్యాషియర్ ఆంజనేయులను క్లస్టర్ మేనేజర్ ప్రశ్నించారు. కంపెనీ చెస్ట్‌బాక్సులో ఆ నగదు పెట్టినట్టు వారు చెప్పారు. ఈ లాకర్ తాళాలు వారిద్దరి వద్ద చెరొకటి ఉంటుంది. ఈ రెండు తాళాల ద్వారానే బ్యాంకు చెస్ట్ తెరుచుకుంటుంది. అయితే వీరిద్దరూ తాళాలు పోయాయని చెబుతుండడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాల మేరకు మంగళవారం బ్యాంకు చెస్ట్ తెరవగా అందులో నగదు లేదని క్లస్టర్ మేనేజర్‌చెప్పారు. కంపెనీ సొమ్మును దుర్వినియోగం చేసిన మేనేజర్, క్యాషియర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

క్రికెట్ బ్యాట్‌తో కొట్టి వ్యక్తి హత్య

పెదతీనార్లలో దారుణం


మృతుడు రమణ


భార్య పిల్లలతో మృతుడు

నక్కపల్లి : పాత గొడవలు కారణంగా ఒక వ్యక్తిని క్రికెట్ బ్యాట్‌తో కొట్టి హత్య చేశారు. వివరాల్లోకి వెళ్తే పెద తీనార్లకు చెందిన కారే రమణ(40), సమీప బంధువు మైలపల్లి లోవరాజు మంగళవారం రాత్రి గొడవ పడ్డారు. ఆవేశంలో లోవరాజు క్రికెట్ బ్యాట్ తీసుకుని రమణ తలపై కొట్టడంతో అక్కడికక్కడే తీవ్ర రక్తస్రావమై పడిపోయాడు. వెంటనే అతన్ని విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మరణించినట్టు నక్కపల్లి సీఐ నారాయణరావు తెలిపారు. రమణకు, లోవరాజుకు పాత గొడవలు ఉన్నట్టు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనపై మృతుడి భార్య కాసులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీలో ఉంచడం జరిగిందన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గంజాయి బ్యాగులు వదిలి పరార్


చింతూరు సెంటర్లో గంజాయి స్మగ్లర్లు వదిలేసిన బ్యాగులు

చింతూరు: పోలీసుల తనిఖీలు తప్పించుకునే ప్రయత్నంలో స్మగ్లర్లు గంజాయి బ్యాగులను వదిలి పరారైన సంఘటన బుధవారం చింతూరులో జరిగింది. స్థానిక పోలీసుస్టేషన్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో బైక్‌పై అనుమానాస్పదంగా వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపే ప్రయత్నం చేశారు. దీంతో వారు బైక్‌ను ఆపకుండా వేగంగా వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని వెంబడించారు. ఈ క్రమంలో స్మగ్లర్లు చింతూరు సెంటర్లో బ్యాగులను విసిరేసి పరారయ్యారు. స్వాధీనం చేసుకున్న బ్యాగులను సోదా చేయగా 20 కిలోల గంజాయి లభ్యమైందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

నేటి నుంచి అంతర్జాతీయ యోగా వారోత్సవాలు

సాక్షి, విశాఖపట్నం : తొమ్మిదో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కేంద్ర పోర్టులు నౌకా, జలరవాణా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు విశాఖపట్నం పోర్టు చైర్మన్ డా.అంగముత్తు ప్రకటించారు. ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకూ వివిధ కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం పోర్టులో ఉన్న నౌకలపై విదేశీ సిబ్బందితో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 19న పోర్టులోని మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో యోగాసనాల కార్యక్రమం, 20న పోర్టు అధికారులు, ఉద్యోగులు, పోర్టు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో కలిసి యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చైర్మన్ వెల్లడించారు. 21న ఉదయం 6 గంటలకు అక్కయ్యపాలెం నెహ్రూ పాలెస్‌లోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. యోగా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు యోగా ఆయుష్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి


ఘటనాస్థలంలో గాయాలతో పడివున్న వరదరాజు

వీఆర్‌పురం: మండలంలోని శ్రీరామగిరి క్రాస్‌రోడ్ వద్ద బుధవారం బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీ కొట్టిన ఘటనలో సీతంపేటకు చెందిన కోట్ల వరదరాజు(33) అనే వ్యక్తి మృతి చెందాడు. వరదరాజు రాజుపేటలోని బంధువుల ఇంటికి శుభకార్యం నిమిత్తం వెళ్లి అక్కడి నుంచి జీడిగుప్ప వెళుతుండగా శ్రీరామగిరి క్రాస్‌రోడ్ వద్ద బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీ కొట్టాడు. అటుగా వెళ్లే వాహనదారులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అతనిని తొలుత రేఖపల్లి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స నిర్వహించి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కూనవరం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వరదరాజు మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

విద్యుదాఘాతంతో నాలుగు పశువులు మృతి

ఆదుకోవాలని ప్రభుత్వానికి రైతులువేడుకోలు


విద్యుత్ వైర్లు తగిలి మరణించిన పశువులు


విద్యుత్ వైర్లు తగిలి మరణించిన పశువులు

రాజవొమ్మంగి : మండలంలోని జమ్మిచావడి గ్రామ సమీపాన కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి ఎల్లెం సత్తిబాబుకు చెందిన రెండు దుక్కిటెద్దు, కొంగర బాబ్జీదొరకు చెందిన రెండు పాడి గేదెలు అక్కడికక్కడే మరణించాయి. సుమారు రూ.1.9 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. వ్యవసాయ పనుల కాలంలో ఇలా జరగడంతో నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. పశువైద్యాధికారి తరుణ్ మరణించిన పశువులకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం చేశారు. కాగా మంగళవారం రాత్రి సంభవించిన ఈదురు గాలులకు విద్యుత్ లైన్‌పై చెట్టు పడిపోవడంతో తీగలు తెగి పడ్డాయని ఏపీఈపీడీసీఎల్ ఏఈఈ సురేష్‌కుమార్ తెలిపారు. కిందికి వేలాడుతున్న వైర్లు పశువుల కాళ్లకు చుట్టుకోవడంతో పశువులు మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు.

క్లుప్తంగా

ఎస్‌హెచ్‌జీల బలోపేతానికి కృషి


కశింకోటలో వీవోఏల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట : స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి కృషి చేయాలని ఎంపీడీవో వి.వి.రవికుమార్ కోరారు. కశింకోటలోని వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన స్వయం సహాయక సంఘాల వీవోఏల సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వారిలో అవగాహన పెంచాలన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. బీమా పథకాల నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ, సచివాలయ సిబ్బందితో సమన్వయంతో ప్రజలకు సేవలందించాలన్నారు. ఏరియా కోఆర్డినేటర్ వి.ధర్మారావు ఆధ్వర్యంలో ఎంపీడీవోను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, మండల సమాఖ్య కార్యదర్శి లక్ష్మి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మేయర్‌కు వినతి


జీవీఎంసీ మేయర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ సునీత, జనకీరామరాజు

తుమ్మపాల : జీవీఎంసీ 82వ వార్డు పరిధిలో సమస్యల పరిష్కారానికి మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత వినతిపత్రం అందించారు. విశాఖలోని మేయర్ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధుల మంజూరు, అసంపూర్తిగా నిలిచిన పనులను పూర్తి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్పొరేటర్ వెంట వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ

తుమ్మపాల : గవరపాలెం సతకంపట్టు శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం కార్యక్రమాలను ఈ నెల 17 నుంచి 19 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లను చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, సభ్యులు నాయుడు, పి.మణి, దొడ్డి రవి, ఆళ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
ది ఫ్లాష్	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
బిచ్చగాడు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ నెగిటివ్-5 యూనిట్, బీ పాజిటివ్-14 యూనిట్లు, బీ నెగిటివ్-2యూనిట్లు, ఓ పాజిటివ్-21 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి గంగయ్య(9182834480)ని సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 368 మంది వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

సుందరం.. బాలికల వసతి గృహం

- రూ.35 లక్షలతో మరమ్మతులు
- కలెక్టర్ చొరవ.. లారస్ ఔదార్యం


మరమ్మతులు పూర్తి చేసుకున్న వసతి గృహం అంతర్భాగం


కశింకోటలో అందంగా ముస్తాబైన బాలికల వసతి గృహం

కశింకోట : స్థానిక సమగ్ర సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం అందంగా ముస్తాబైంది. అరకొర పనులు మినహా తుది మెరుగులు దిద్దుకుంది. జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చొరవ, లారస్ సంస్థ ఔదార్యంతో నూతన హంగులు సంతరించుకున్నాయి. రూ.35 లక్షల నిధులతో లారస్ పరిశ్రమ ఈ పనులను పూర్తి చేసింది.

ఏజెన్సీ వారికి అనుకూలం

స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన సాంఘిక సంక్షేమశాఖ నిర్మించిన భవనంలో బాలికల వసతి గృహం 2010లో ప్రారంభమైంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాలికలు వచ్చి ఇక్కడ చేరారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు 346 మంది బాలికలు ఈ వసతి గృహంలో ఉంటూ పక్కనే ఉన్న జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో చదువుతున్నారు. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతానికి చెందిన బాలికలకు ఈ వసతి గృహం చాలా అనుకూలం. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన చింతపల్లి, పాడేరు, లంబసింగి తదితర ప్రాంతాలనుంచి ఎక్కువగా బాలికలు ఇక్కడ వసతి పొంది, విద్యాభ్యాసం చేస్తున్నారు.

కలెక్టర్ చొరవతో..

ఏళ్లనాటి భవనం కావడంతో మరమ్మతులకు గురైంది. ఏడాది క్రితం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వసతి గృహాన్ని సందర్శించే సమయంలో దీని దుస్థితి తెలుసుకున్నారు. వెంటనే ఆయన చొరవ తీసుకుని, లారస్ ప్రతినిధులతో మాట్లాడారు. బాలికల ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకున్న లారస్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్సార్) నిధుల్లో రూ.35 లక్షలు కేటాయించింది. వేసవి సెలవుల్లో విద్యార్థుల్ని ఇళ్లకు పంపించి, పనులు చేపట్టారు. విద్యార్థినుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రహరీ ఎత్తు పెంచారు. భవనానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టారు. పాడైన బాత్‌రూమ్‌లను, మరుగుదొడ్లను బాగు చేశారు. భవనానికి అందంగా రంగులు వేసి, విద్యార్థులకు, ఇక్కడ తమ పిల్లల్ని చదివించాలనుకునే తల్లిదండ్రులకు ఆహ్లాదం కలిగేలా తీర్చిదిద్దారు.

చిన్నపాటి పనులు మినహా..

జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చొరవ తీసుకోవడంతో వసతి గృహం రూపురేఖలు మారిపోయాయి. లారస్ పరిశ్రమ ప్రతినిధులు దగ్గరుండి మరీ మరమ్మతులు చేయించారు. బాలికలకు అవసరమైన అన్ని వసతుల్ని ఏర్పాటు చేశారు. చిన్న చిన్న పనులు మినహా, మేజర్ మరమ్మతులన్నీ పూర్తయ్యాయి. వాటిని కూడా వేగంగా పూర్తి చేస్తామని, సంస్థ ప్రతినిధులు చెప్పారు. వసతి గృహాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి కారుకులైన కలెక్టర్‌కు, లారస్ యాజమాన్యానికి కృతజ్ఞతలు.

– పి.నిర్మల, సంక్షేమ అధికారి, బాలికల వసతి గృహం, కశింకోట

ఘనంగా యోగసిద్ధి ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ట


యోగసిద్ధి ఆంజనేయస్వామి సన్నిధిలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు

కశింకోట : స్థానిక కస్పావీధిలో నూతనంగా నిర్మించిన యోగసిద్ధి ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా హోమం, ప్రతిష్టా కార్యక్రమాన్ని వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు నిర్వహించారు. ఆలయాన్ని పూలమాలలతో అందంగా అలంకరించి స్వామి విగ్రహానికి కరెన్సీ నోట్ల మాలతో ముస్తాబుచేశారు. విగ్రహాన్ని సమకూర్చిన ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తదితరులు స్వామిని దర్శించుకున్నారు. వీరికి నిర్వాహకులు జ్ఞాపికలను అందించి సత్కరించారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని రేజేటి శ్రీరామాచార్యులు ప్రారంభించారు. ఎక్కువ సంఖ్యలో భక్త జనం పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుమ్మపాల : ఏపీఈపీడీసీఎల్ కశింకోట సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కశింకోట డివిజన్ ఈఈ ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తూరు, పిసినికాడ, సంపతిపురం, వీజేపాలెం, మూలపేట, సత్యనారాయణపురం, కూండ్రం, ఆర్‌వీపాలెం, కుంచంగి, విసన్నపేట గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ

సబ్బవరం: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు అందించడానికి ఈపీడీసీఎల్ నిరంతరం కృషి చేస్తుందని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ చెప్పారు. సబ్బవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పలు సూచనలు ,సలహాలు అందించారు. సిబ్బంది అంతా భద్రత ప్రమాణాలు పాటిస్తూ అప్రమత్తంగా పనిచేయాలన్నారు. రెండు రోజుల కిందట వచ్చిన వర్షాలు, భారీ గాలుల వల్ల దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గించడానికి, లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించడానికి అవసరమైన అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే 1912 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఈపీడీసీఎల్ డీఈఈ నిరీక్షన్ అంబేడ్కర్, ఏఈలు అశోక్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు అందిస్తున్న జేడీ జగన్నాథరావు

తుమ్మపాల : అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ కేవీకే జగన్నాథరావు బుధవారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో విత్తనాలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకుని నాణ్యమైన విత్తనాలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఏఆర్‌ఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పార్వతీసాంబశివుని కల్యాణం

మునగపాక : నాగులాపల్లిలో బుధవారం రాత్రి పార్వతీ సమేత సాంబశివుని కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వివాహం వైభవంగా జరిపించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కల్యాణం తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

కల్వర్టుల వద్ద పైప్‌లైన్లు


సాగునీటి కల్వర్టుల వద్ద పైపులైన్ పనులకు మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

కశింకోట : స్థానిక శారదానది ఆవల పొలాల్లో సాగునీటి కాలువకు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మూడు మదుంల(శనివారం ఒడ్డు) వద్ద పైపులైన్ ఏర్పాటు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక రైతుల అభ్యర్థన మేరకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఈ పనులకు రూ.9 లక్షలు మంజూరు చేశారు. దీంతో మార్కింగ్ ఇచ్చి పనులను ప్రారంభించి వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు పర్యవేక్షించారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


వి.హేమసుందర్రావు, ఎంపీడీవో, పరవాడ

పరవాడ: కడప జిల్లాలోని స్పోర్ట్స్ పాఠశాలలో4, 5 తరగతుల్లో చేరేందుకు స్పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఈ నెల 15 నుంచి 20 తేదీల మధ్య ఎంపికలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. బుధవారం పూర్తి వివరాలను ఆయన వెల్లడించారు. క్రీడల్లో వారికున్న ప్రావీణ్యత, ఈవెంట్స్‌లో వచ్చిన మార్కులను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. కడప వెళ్లడానికి ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ పాఠశాలలో రాష్ట్ర వ్యాప్తంగా 4వ తరగతిలో 20 మంది బాలికలు, 20 మంది బాలురను తీసుకోవడం జరుగుతుందన్నారు. 5వ తరగతిలో 11 మందిలో 7గురు బాలురు, 4గురు బాలికలను తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. స్పోర్ట్స్ పాఠశాలలో చేరడానికి అవసరమైన విధి విధానాలను సంబంధిత పీడీలను అడిగి తెలుసుకోవాలని ఎంపీడీవో చెప్పారు.

నేడు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సమావేశం

స్థానిక మరిడిమాంబ కల్యాణ మండపంలో గురువారం 10 గంటలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సామాజిక తనిఖీ వేదిక సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. సంబంధిత అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

రాష్ట్రంలో ప్రజల ప్రభుత్వం నడుస్తోంది

- వచ్చే ఎన్నికల్లో దొంగల ముఠాను నమ్మి మోసపోవద్దు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్


అవ్వకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్


మహిళలకు అభివాదం చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

తుమ్మపాల : రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పట్టణంలోని 82వ వార్డు పరిధి శారదాకాలనీలో కార్పొరేటర్ మందపాటి సునీత ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో జరిగే ఎన్నికల్లో పోటీ చేసేందుకు దొంగల ముఠా సిద్ధంగా ఉందని, వారిని నమ్మితే దొంగలు రాష్ట్రాన్ని దోచుకునే ప్రమాదముందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో ఆయన చేసిన ప్రజాసంక్షేమం, అభివృద్ధే జగన్‌ను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల్లో ఎప్పుడూ చూడని ముఖ్యమంత్రిని చూస్తున్నామంటే రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగన్ పాలనను అభివర్ణించారు. ప్రజాసంక్షేమం కోసం ఆలోచించే ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తుంటే ఎల్లో మీడియాకు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. పత్రికలు ప్రజల పక్షాన నిలవాలని హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వానికి.. దొంగల ముఠాకు యుద్ధం జరగబోతోందన్నారు. ఈ కురుక్షేత్రంలో జగనన్నకు మనమంతా అండగా నిలవాలని కోరారు. ఎవరెన్ని పొత్తులతో వచ్చినా ప్రజలు తమ ప్రభుత్వానికే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. శారదా కాలనీలో రూ.50 లక్షలతో రోడ్లు, కాలువలు నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. మరో రూ.50 లక్షలతో కల్వర్టులు, కాలువలు నిర్మాణం చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

అంతకుముందు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. స్థానిక సమస్యల్ని ఆరా తీశారు. రూ.50 లక్షలతో నిర్మించే కల్వర్టులు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చాలా కాలంగా గుండె జబ్బుతో బాధపడుతున్న సువర్ణ అనే మహిళ తనకు ఆరోగ్యశ్రీ ద్వారా రూ.లక్షా 80 వేల ఖర్చుతో ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగిందని, ప్రభుత్వానికి ఎంతో రుణపడి ఉంటానని మంత్రి వద్ద తన ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ సీనియర్ నాయకుడు గైపూరి రాజు, కార్యకర్తలు, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానం


రక్తదాతను సత్కరిస్తున్న సిబ్బంది

అనకాపల్లిటౌన్ : ఆరోగ్యవంతులైన వ్యక్తులు చేసే రక్తదానం క్షతగాత్రులను చాలా వరకు మృత్యువు నుంచి కాపాడుతుందని ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వైఎంవీఏ హాల్లో సర్వేజనా ఐక్యవేదిక, చైల్డ్ ఫండ్ ఇండియా, లింగ్ వర్కర్స్ స్కీమ్, ఎస్‌వీడీఎస్, ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్, శ్రీసూర్య అభయాంజనేయ బ్లడ్ బ్యాంకుల ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టిలో కృత్రిమ రక్తం దొరకదని, వ్యక్తుల నుంచి సేకరించిన రక్తాన్ని వివిధ మార్గాల్లో భద్రపరచి అత్యవసరమైన రోగులకు అందిస్తారని తెలిపారు. 18 నుంచి 60 ఏళ్ల వయసున్న ఆరోగ్యవంతులు ఏడాదికి మూడుసార్లు రక్తదానం చేయొచ్చన్నారు. రక్తదానం చేసిన వ్యక్తిలో కేవలం 10 రోజుల్లో రక్తం పూర్వపు స్థాయికి ఉత్పత్తి అవుతుందన్నారు. రక్తదాన దినోత్సవంలో భాగంగా సుమారు 50 మంది యువకులు రక్తదానం చేశారు. వీరిని సూపరింటెండెంట్ సత్కరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యాలయం రక్తనిధి వైద్యురాలు కనకదుర్గ, వివిధ బ్లడ్ బ్యాంక్ సెంటర్ల ప్రతినిధులు కోరిబిల్లి పరి, నదియా, ఆడారి శ్రీనివాసరావు, దాడి బుజ్జి, వేగి త్రినాథ్, ఆళ్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో విద్యా విప్లవం

జగనన్న విద్యా కానుక పంపిణీలో ప్రజాప్రతినిధులు


తుమ్మపాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను అందిస్తున్న ప్రజాప్రతినిధులు


కశింకోట బాలికల హైస్కూల్లో జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి, తదితరులు

అనకాపల్లి రూరల్/కశింకోట : నియోజకవర్గంలోని ఎలు పాఠశాలల్లో బుధవారం జగనన్న విద్యా కానుక(జేవీకే) కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనంతగా ప్రభుత్వ స్కూళ్లలో చదివే పిల్లల కోసం సీఎం జగన్ పరితపిస్తున్నారని కొనియాడారు. పాఠశాలల ప్రారంభంనాడే, విద్యార్థుల చదువుకు కావాల్సిన సామగ్రిని అందించడం విశేషమన్నారు.

- అనకాపల్లి మండలంలోని తుమ్మపాల జెడ్పీ హైస్కూల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ రాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు జేవీకే కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో పాఠశాలలు పునఃప్రారంభమైన రోజునే విద్యా కానుక కిట్లను అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తుమ్మపాలకు జూనియర్ కళాశాల మంజూరుపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు, హెచ్‌ఎం శంకరరావు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్రశేఖర్, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, వైస్ ప్రెసిడెంట్ చదరం చిన్న, పన్నీరు వెంకటలక్ష్మి, పడాలి గణపతి, గొంతిన శ్రీను, ఆర్టీసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల పాఠశాలల్లో ఎంపీపీ కలగా లక్ష్మి విద్యా కానుకను విద్యార్థులకు అందించారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, ఎంఈవో చిట్టిబాబు, హెచ్‌ఎంలు ఎం.ఎస్.స్వర్ణకుమారి, ఆచంట రవి, ఉపాధ్యాయులు భీశెట్టి ఆనంద్, శేషుకుమారి, విద్యా కమిటీ చైర్మన్ యల్లపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- మండలంలోని అమీన్‌సాహెబ్‌పేటలో విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు చేతుల మీదుగా జగనన్న విద్యా కానుక అందించారు. సర్పంచ్ మలసాల ధనమ్మ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, హెచ్‌ఎం రమణ తదితరులు పాల్గొన్నారు.
- బంగారయ్యపేట స్కూల్లో ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి సతీష్ జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


అమీన్‌సాహెబ్‌పేటలో జేవీకే కిట్లను అందిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు


బంగారయ్యపేటలో జేవీకే కిట్లను అందిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి సతీష్

ఎండ, వడగాడ్పులు.. ఉక్కబోత


ఖాళీగా దర్శనమిస్తున్న జాతీయ రహదారి

కశింకోట : మండల ప్రజలు బుధవారం వడగాడ్పులతో సతమతమయ్యారు. అధిక ఉష్ణోగ్రతతోపాటు వేడిగాలులు వీయడంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉదయం 10 గంటల నుంచే ఉక్కబోత వాతావరణం నెలకొనడంతో ప్రజలు బయటకు వెళ్లడానికి సాహసించలేదు. సాయంత్రం వరకు సుర్రుమనే ఎండ, వడగాడ్పులతో ఇళ్లకే పరిమితమయ్యారు. కశింకోటలోని జాతీయ రహదారి, పంచాయతీ ప్రధాన రహదారులు జన సంచారం లేక బోసిపోయాయి. సాయంత్రం ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో వాతావరణం కాస్త చల్లబడి, ఉపశమనం చెందారు.

మృతుడి కుటుంబానికి బాసటగా..

పరవాడ: కిడ్నీ వ్యాధితో మృతి చెందిన పరవాడ గ్రామానికి చెందిన కుబిరెడ్డి శ్రీను కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు పలువురు ముందుకు వచ్చి తమకు తోచిన సహాయాన్ని అందజేశారు. బొంకుల దిబ్బ నూకాంబిక యూత్ రూ.88 వేలు, మరిడిమాంబ యూత్ రూ.20 వేలు, ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ రూ.25 వేలు వెరసి రూ.1.33 లక్షలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, నాయకులు పైల హరీష్, రెడ్డి శ్రీనివాసరావు, పైల పైడింనాయుడు, శ్రీహరి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలపై అవగాహన

మునగపాక : పంటల సాగుకు సంబంధించి మట్టి నమూనా ఎంతో కీలకమని, భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు సాగు చేపట్టడం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రాజ్‌కుమార్ తెలిపారు.

వాడ్రాపల్లి, అరబుపాలెం గ్రామాల్లో బుధవారం రిలయన్స్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త నిర్వహణలో భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. మట్టి నమూనాలు ఎలా సేకరించాలో వివరించారు. శాస్త్రవేత్తలు కిషోర్, బాబు రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ తిరుమలరావు, ప్రోగ్రామ్ ఆర్గనైజర్ వెంకట రాము, రైతులు శరగడం రామకృష్ణ, పసుపులేటి లక్ష్మణరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు చేగువేరా

తుమ్మపాల : ప్రపంచ మానవాళి విముక్తి కోసం సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు చేగువేరా అని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల శివాజీ అన్నారు. పట్టణంలో ఓ ప్రైవేటు భవనంలో నిర్వహించిన చేగువేరా 95వ జయంతి కార్యక్రమంలో చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.